క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

కనిగిరి రూరల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాధవరావు పోలీస్‌స్టేషన్‌లో ఉండే వివిధ విభాగాలు, అవి పనిచేసే తీరు, సిబ్బంది విధులు, ఫిర్యాదుల స్వీకరణ తదితర అంశాల గురించి వివరించారు. ఆల్ఫా, గోమతి పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

సింగరాయకొండ: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి స్త్రీలు, పిల్లల రక్షణ–సామాజికపాత్ర అనే అంశంపై విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం కె.మహాలక్ష్మి, ఉపాధ్యాయురాలు జి.కృష్ణవేణి, ఏఎస్సైలు షేక్ మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ బేగ్, మహిళా పోలీస్ పి.భారతి పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన చింతలచెరువు



దంపతులను ఆశీర్వదిస్తున్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

పామూరు: మండలంలోని వగ్గంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బైరెడ్డి వెంకట శివశంకర్‌రెడ్డి వివాహం వెంకట సుశీలతో బుధవారం వగ్గంపల్లెలోని ఆయన స్వగృహంలో జరిగింది. నూతన వధూవరులను రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ రెక్కల అనితారెడ్డి, రెడ్డిసంక్షేమసంఘం నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, మూలె గోపాల్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, ముడియాల అనంతరెడ్డి, పిడికిటి వెంకట నారాయణ, కేతు ఎస్‌వీ బ్రహ్మారెడ్డి, ఎఫ్‌పీఓ ఆర్.వెంకట భాగ్యలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంపై గురువారం స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక బస్సు యాత్ర నవంబర్ 1న కనిగిరికి చేరునున్నట్లు చెప్పారు. ఆ బస్సు యాత్రను నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ప్రణాళికపై పార్టీ శ్రేణులతో చర్చిస్తామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి గ్రామంలో గురువారం ఉదయం 8.30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న సేవలు రాష్ట్రానికి అవసరం



సదస్సుకు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న అశోక్‌బాబు

● వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు

పొన్నలూరు/మర్రిపూడి: రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు అవసరమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పొన్నలూరు, మర్రిపూడి మండల కేంద్రాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పెత్తందారులకు పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలన్నారు. గ్రామ స్థాయిలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో చేపట్టిన విప్లవాత్మక పనులపై గ్రామాల్లో చర్చించాలన్నారు. చంద్రబాబు పాలనకు, సీఎం వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రజల సొమ్మును నొక్కేసినప్పటికీ ఆయనను నిజాయితీపరుడుగా టీడీపీ నాయకులు చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలను రాష్ట్ర ప్రజలు గ్రహించారని, టీడీపీ నాయకులు ఎన్ని వేషాలు వేసినా ప్రజలు పట్టించుకోరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఆరు నెలలపాటు అప్రమత్తంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భేదాభిప్రాయాలు వీడి సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడమే లక్ష్యమన్నారు. ఓటర్ల జాబితాపై దృష్టిపెట్టి కొత్త ఓట్లను చేర్పడంతోపాటు దొంగ ఓట్లపై అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పొన్నలూరు సదస్సులో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ అనుమోలు శివయ్య, సంగమేశ్వరం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బూచిరాజు మాల్యాద్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, మాజీ సర్పంచ్ కంచర్ల రమణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మర్రిపూడి సదస్సులో మండల పార్టీ అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున, జేసీఎస్ కన్వీనర్ పూనూరి సంజీవరెడ్డి, వనిపెంట మల్లికార్జురెడ్డి, యూ బాలచెన్నారెడ్డి, చెన్నారెడ్డి, అలికేపల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ అల్లాటిపల్లి కొండారెడ్డి, కృష్ణమూర్తి, చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొంటు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేవలు

● వరికూటి అశోక్‌బాబు



అనంతవరంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు



పాత సింగరాయకొండ వైద్య శిబిరంలో డాక్టర్లు, ప్రజాప్రతినిధులు

టంగుటూరు: పేద ప్రజల ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అనంతవరం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారన్నారు. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి, బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 303 మందిని వైద్యులు పరీక్షించి, మందులు అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, గ్రామ కన్వీనర్ ఉప్పలపాటి సుబ్బరాజు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి నాగరాజు, ఏపీఎస్ రాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, కసుకుర్తి బాలకోటయ్య, వైద్యులు బాలాజీ అశోక్, రెహానా, సీహెచ్‌ఓ మాతయ్య పాల్గొన్నారు.

575 మందికి వైద్య పరీక్షలు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 575 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ చైతన్య కృష్ణ తెలిపారు.

డాక్టర్లు వంశీధర్, ఈఓఆర్‌డీ సుధాకర్, సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఏపీయం విద్యాసాగర్



మాట్లాడుతున్న ఏసీ కత్తి కళ్యాణ్

సీఎస్‌పురం (పామూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం గంటా విద్యాసాగర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో బుధవారం పీఎం ఈజీపి పథకంపై మండలస్థాయిలో మండలసమాఖ్య ఆఫీస్‌బేరర్స్, వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ పథకాలద్వారా మహిళలకు జీవనోపాదులు అభివృద్ధి చేసుకునేందుకు ఈ పథకం కింద గేదెలు వైఎస్సార్ బడుగు వికాసం కింద కార్లు, పిండిమిల్లులు, ఇస్త్రీల యూనిట్‌లు మంజూరు చేస్తామన్నారు. శిక్షణ పొందిన ఓబీ, వీఓఏలు మండలంలోని అన్ని గ్రామసంఘాల్లోని సభ్యులకు దీనిపై ఈ నెల 31వ తేదీ లోగా నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అవగాహన కల్పించడంతో పాటు ఆసక్తి కలిగిన పొదుపు మహిళలతో దరఖాస్తులు చేయించేందుకు సిద్ధం చేయాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారు సుబ్బమ్మ, సీసీలు ఐ.మస్తాన్‌రెడ్డి, కాశయ్య, నారాయణమ్మ, అకౌంటెంట్ సువార్తమ్మ పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యులు సుస్థిర జీవనోపాదుల ఉత్పత్తులపై అవగాహన కల్గి ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఏపీఎం టి.జీవరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌సీ గ్రూపుల్లోని సభ్యులకు గ్రామ సంఘాల్లో జరిగే కార్యక్రమాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కె.నాగలక్ష్మమ్మ, సీసీలు బాషా, సుబ్రహ్మణ్యం జిలానీ శ్రీనివాసరావు, ఎల్‌సీ బాలసుబ్రహ్మణ్యం, వజ్రమ్మ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

వెలిగండ్ల: సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి గ్రామాల్లో విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2018లో మండలంలోని గణేశుని కంఠ్రిక గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య అవగాహన లోపం కారణంగా చిన్నపాటి సంఘటన జరిగిందని, అప్పట్లో అధికారులు గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇరువర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చారన్నారు. అప్పటి నుంచి గ్రామంలో అందరూ కలిసిమెలిసి పండుగలు, ఉత్సవాలు చేసుకుంటున్నారన్నారు. కానీ అప్పట్లో జరిగిన సంఘటనలు ఇటీవల జరిగినట్లు కొంత మంది సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలా ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై మహేష్ కుమార్ ఉన్నారు.

రేపు ఓటరు ముసాయిదా జాబితా ప్రకటన

● ఈఆర్‌ఓ నారదముని



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి(సింగరాయకొండ): కొండపి నియోజకవర్గ నూతన ఓటరు ముసాయిదా జాబితాను 27వ తేదీ శుక్రవారం ప్రకటిస్తామని ఈఆర్‌ఓ నారదముని వెల్లడించారు. కొండపి రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆరు మండలాల రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు ముసాయిదా జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నారదముని మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి బీఎల్‌ఓ వద్ద కొత్త ఓటరు ముసాయిదా జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో సవరణలు ఉంటే డిసెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వాటిపై డిసెంబరు 26వ తేదీలోగా విచారణ చేపట్టి తుది జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రకటిస్తామన్నారు.

వసంతోత్సవంతో ముగిసిన శరన్నవరాత్రులు





పడమటి కట్టకిందపల్లెలో విజయ దుర్గా అలంకరణలో పార్వతీదేవి | సీఎస్‌పురంలో విజయదుర్గా దేవిగా కామాక్షి అమ్మవారు

పామూరు: దసరా శరన్నవరాత్రి వేడుకలు వాసవీమాత వసంతోత్సవం, ఊంజల్‌సేవతో బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం వాసవీమాత ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఉత్సవమూర్తిని కేరళవాయిద్యాలు, మేళతాళాలతో ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై అమ్మవారికి గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. వసంతోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ యేల్చూరి బాలకొండలు, గౌరవాధ్యక్షుడు విశ్వనాథుని సత్యనారాయణ, శేగు క్రిష్ణయ్య, దరిశి మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం నిర్వహించారు.

సీఎస్‌పురం (పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా చివరిరోజు బుధవారం చంద్రమౌళీశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారు విజయదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీకష్ణశర్మ కామాక్షి అమ్మవారికి అభిషేకం, కుంకుమపూజ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.



పామూరులో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆరోగ్య సురక్షతో ప్రతి కుటుంబానికి రక్ష

● పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

కనిగిరి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదల జీవితాలకు రక్షణగా నిలుస్తోందని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టి.మంగమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో డాక్టర్ దాదా షరీఫ్, డాక్టర్ ఆయేషా, డాక్టర్ లోకేష్, డాక్టర్ తులసీదాస్‌లు 515 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రహీం, మాజీ సర్పంచ్ మూలె మాలకొండారెడ్డి, మూలె ఈశ్వరమ్మ, గురుబ్రహ్మారెడ్డి, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, ఈఓఆర్‌డీ అన్నమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎంవీ భాస్కర్, ఎస్‌కే జిలానీ, సీహెచ్‌వీ కళ్యాణి, రమణమ్మ, శోభారాణి, నాగేంద్రముని, కార్యదర్శి అంకమ్మరాజు, వీఆర్వో ఎస్‌కే గరీబా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అమ్మిన వారిపై కేసు నమోదు చేయాలి

హనుమంతునిపాడు: మండల పరిధి ఆనందపురం అగ్రహారం రెవెన్యూలో సర్వేనంబర్ 1లో 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ చేసి ఇతరులకు అమ్మిన గ్రామానికి చెందిన ఐదుగురితో పాటు కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హనుమంతునిపాడు తహసీల్దార్ ఎస్ హరిబాబు బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం అగ్రహారం రెవిన్యూలోని సర్వేనంబర్ 1లో 550 ఎకరాలు పైబడి ప్రభుత్వ భూమి ఉంది. అందులో గత 20 ఏళ్లక్రితం ప్రభుత్వం పేదలకు 448 ఎకరాలు పైబడి డీకే పట్టాలు ఇచ్చారు. ఆ భూమిని కొంత మంది సాగు చేసుకుంటున్నారు. ఆ గ్రామానికి చెందిన సూరెబోయిన బాలయ్య, తండ్రి పెద్ద బాలగురవయ్య, సూరెబోయిన బాలయ్య,తండ్రి చిన్న బాలగురవయ్య, సూరెబోయిన బాలగురవయ్య, తండ్రి బాలగురవయ్య, సూరెబోయిన వెంకటలక్ష్మలు 120 ఎకరాలు ప్రభుత్వ భూమిని 2020న జనరల్ పవర్ ఆఫ్ అటార్ని హక్కు కల్పిస్తూ గుంటూరు జిల్లా వినుకొండ మండలం వినుకొండ పట్టణం శ్రీనివాసనగర్‌కు చెందిన గుర్రం కోటయ్య కుమారుడు అనంత క్రిష్ణ పేరు రిజిస్టర్ చేయించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి అక్రమణలు చేసి అమ్మిన వారిపై కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

వలేటివారిపాలెం: 40 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల్లో శనగ విత్తనాలుకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పట్టా దారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ ఉన్న మొబైల్ తీసుకొని వెళ్లి సంబంధిత రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ముందుగా నగదు చెల్లించాలని, 10 రోజుల్లో శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు.